
నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | NIZAMABAD

ఎన్ని చట్టాలు తెచ్చినా బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు, లైంగిక దాడి యత్నాలు ఆగడం లేదు. అఘాయిత్యాల నివారణకు పోక్సో చట్టం తెచ్చినా కామాంధుల తీరుమారడం లేదు. జిల్లాలో పోక్సో కేసుల నమోదు సంఖ్య పెరుగుతూనే ఉన్నది. వారం, పదిహేను రోజుల్లోనే బాలికలపై లైంగికదాడికి పాల్పడిన కేసులు నాలుగు నమోదవడం కలకలం రేపుతున్నది. నిజామాబాద్ నగరంలో మైనర్లనే లక్ష్యంగా చేసుకుంటున్న కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఈ మధ్యకాలంలో పెరిగాయి. ఒంటరిగా కనిపిస్తే చాలు చిన్నారులపై దాష్టీకానికి పాల్పడుతున్న ఘటనలు కలిచివేస్తున్నాయి. చాక్లెట్ ఆశ చూపుతూ.. మాయమాటలు చెబుతూ బాలికలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారీ మానవమృగాళ్లు. పదిహేను రోజుల్లో వరుసగా చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించడంతోనే ఇలాంటి నేరాలు పెరిగిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# బాలికకు భద్రతేది?

## చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు

- 15 రోజుల్లోనే ఆరు ఘటనలు
- నమ్మించి వంచిస్తున్న వైనం
- ఐదేండ్ల చిన్నారినీ వదలని మృగాళ్లు
- తాజాగా బోధన్‌లో మరో అకృత్యం వెలుగులోకి..
- బాలికపై దారుణానికి ఒడిగట్టిన కౌన్సిలర్

**బాలికకు భద్రత కరువైంది.** అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పసి మనసులకు పెనుగాయాలు చేస్తున్న సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఆరు ఉదంతాలు చోటు చేసుకోవడం కలవరపాటుకు గురి చేస్తున్నది. పసితనంపై పైశాచికత్వం ఏ విధంగా కోరలు చాస్తున్నదో చాటి చెబుతున్నది. మాయ మాటలు చెప్పి చిన్నారులను చిదిమేస్తున్నారు. ముద్దలొలికే మాటలతో పైకి కపట ప్రేమను నటిస్తూ కాటేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన దారుణాలు చూస్తే పరిస్థితి ఏ విధంగా దిగజారిందో అర్థమవుతుంది. ప్రజా పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిన వైనం కళ్లకు కడుతున్నది. జూలై 20వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు.. అంటే కేవలం పక్షం రోజుల్లోనే ఆరుగురు బాలికలు అన్యాయానికి గురయ్యారు. మృగాళ్ల చేతిలో నలిగిపోయారు. తాజాగా బోధన్‌లో ఏకంగా ఓ కౌన్సిలర్ కూడా వక్రబుద్ధి ప్రదర్శించి బాలికను నమ్మించి వంచించాడు. ప్రజాభద్రత పట్టని పాలకులు, సీరియస్‌గా స్పందించని పోలీసులు, కోరల్లేని చట్టాలు.. వెరసి బాలిక భద్రతకు, బంగారు భవిష్యత్తుకు పెను ముప్పుగా పరిణమించాయి.

– వినాయక్‌నగర్, ఆగస్టు 6

# నమ్మించి.. వంచించి

- బాలికపై కౌన్సిలర్ అఘాయిత్యం
- నిందితుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు

శక్కర్‌నగర్, ఆగస్టు 6: పరిచయమున్న వ్యక్తే కదా అని నమ్మి వెళ్లిన పాపానికి బాలికను వంచించాడో కౌన్సిలర్. ఇంటికి తీసుకెళ్తానని కారులో ఎక్కించుకున్న నిందితుడు నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. ఎడపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన బోధన్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు కథనం ప్రకారం.. బోధన్ పట్టణంలోని మూడో వార్డు (శక్కర్‌నగర్) కౌన్సిలర్ కొత్తపల్లి రాధాకృష్ణకు నిజామాబాద్‌లో సోమవారం రాత్రి ఆటోలో వెళ్తున్న తన ప్రాంతానికి చెందిన, పరిచయమున్న బాలిక (16) కనిపించింది. దీంతో ఆమెతో మాట కలిపి, తాను బోధన్‌కే వెళ్తున్నానని చెప్పి కారులో ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో ఎడపల్లి నుంచి మంగళ్‌పాడ్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికపై దారుణానికి పాల్పడ్డాడు. అనంతరం ఎడపల్లికి వచ్చి వైన్స్‌లో మద్యం తీసుకుంటుండగా, కారులో ఉన్న బాలిక కేకలు వేసింది. గమనించిన స్థానికులు బాలికను ప్రశ్నించగా జరిగింది చెప్పింది. దీంతో కౌన్సిలర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడ్ని పోలీసులు బోధన్ సీఐ కార్యాలయానికి తరలించగా, బాధితురాలి సంబంధీకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆందోళనకు దిగారు. నిందితుడ్ని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు.. కౌన్సిలర్‌పై కిడ్నాప్‌తో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కౌన్సిలర్ అఘాయిత్యానికి పాల్పడిన ప్రాంతాన్ని ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపి, నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

**అన్న, తమ్ముడు అంతే..**

కౌన్సిలర్ రాధాకృష్ణ సోదరుడు రవీందర్ సైతం గతంలో ఇలాగే ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఏడాదిన్నర క్రితం మూడో వార్డుకు చెందిన ఓ మైనర్‌పై దారుణానికి ఒడిగట్టిన కేసులో రవీందర్‌తో పాటు రాధాకృష్ణ కూడా జైలుకు వెళ్లొచ్చారు. ఆ ఉదంతం మరువక ముందే రాధాకృష్ణ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.



బోధన్‌లోని సీఐ ఆఫీసు ఎదుట సోమవారం అర్ధరాత్రి బైఠాయించిన ఆందోళనకారులు

## పదిహేను రోజుల్లో నమోదైన కేసులు

**జూలై 20న:** నగరంలోని మూడో టౌన్ పరిధిలో ఇంటర్ చదివే బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడో కామాంధుడు. పెండ్లయి ఇద్దరు సంతానం ఉన్నప్పటికీ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తనకు జరిగిన అన్యాయాన్ని బాలిక కుటుంబీకులతో చెప్పడంతో విషయం బయటికి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**జూలై 30న:** నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఐదేండ్ల చిన్నారి ఇంటి ఎదుట ఒంటరిగా ఆడుకుంటుండగా ఓ కామాంధుడు చాక్లెట్ ఆశ చూపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తనపై జరిగిన దారుణాన్ని ఆ చిట్టితల్లి కన్నవారితో చెప్పుకోలేక రెండు రోజులపాటు బాధను భరిస్తూ వచ్చింది. చివరికి ఇబ్బందిని తట్టుకోలేక కన్న తల్లికి చెప్పడంతో అఘాయిత్యం వెలుగులోకి వచ్చింది.

**ఆగస్టు 2న:** మూడోటౌన్ పోలీస్ స్టేషన్‌లో మరో లైంగికదాడి కేసు నమోదయ్యింది. జూలై 30న నగరంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్న ఓ యువకుడు మాయమాటలు చెప్పి హైదరాబాద్‌కు రప్పించుకున్నాడు. యువకుడిని నమ్మి వెళ్లిన విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాధితురాలిని గుర్తించి నగరానికి తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**ఆగస్టు 2న:** నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ షోరూంలో పనిచేస్తున్న బాలికను అదే సంస్థలో పనిచేసే ఓ యువకుడు ప్రేమపేరుతో లొంగదీసుకొని దారుణానికి ఒడిగట్టాడు. కొన్ని రోజుల తర్వాత విషయం బాలిక ఇంట్లో వారికి తెలియడంతో కూతురికి జరిగిన అన్యాయంపై తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నెల 2న నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు.

**ఆగస్టు 2న:** బాన్సువాడ మండలం బోర్లం రోడ్డులో ఈ నెల 2న ఓ యువకుడు తొమ్మిదేండ్ల బాలికపై లైంగికదాడికి యత్నించాడు. నిందితుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

# క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..



టోర్నీ విజేతలతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఆగస్టు 6: క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని, భీమ్‌గల్‌లో రాష్ట్రస్థాయి క్యారం పోటీలను నిర్వహించడం గర్వకారణమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న మందుల హన్మాండ్లు స్మారక రాష్ట్రస్థాయి క్యారం ర్యాకింగ్ టోర్నీ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ మారుమూల పట్టణమైన భీమ్‌గల్‌లో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించడం, టోర్నీలో సుమారు 200మంది క్రీడాకారులు పాల్గొనడం గొప్ప విషయమన్నారు. కాలిఫోర్నియాలో అక్టోబర్‌లో నిర్వహించే వరల్డ్ కప్‌లో దేశం తరపున పాల్గొనే ఎనిమిది మంది క్రీడాకారుల్లో తెలంగాణ నుంచి నలుగురు ఉండడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ క్యారం పోటీలకు తనవంతు సాయం చేస్తానని పేర్కొన్నారు. టోర్నీ నిర్వహణకు ముందుకొచ్చిన భీమ్‌గల్ వాసి, అంతర్జాతీయ క్రీడాకారుడు రవీందర్‌గౌడ్‌ను ఇతర క్రీడాకారులను అభినందించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రథమ బహుమతి కె.శ్రీనివాస్, ద్వితీయ బహుమతి సూర్యప్రకాశ్, డబుల్స్‌లో ప్రథమ బహుమతి ఆదిత్య–జాఫర్, ద్వితీయ బహుమతి నరేశ్–వాసీం, మహిళల సింగిల్స్‌లో జయశ్రీ ప్రథమస్థానంలో నిలువగా అనిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో క్యారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నే ప్రేమలత సురేందర్, మాజీ ఎంపీపీ మహేశ్, మాజీ జడ్పీటీసీ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, సొసైటీ చైర్మన్ నర్సయ్య, సీనియర్ క్రీడాకారులు సతీశ్, శ్రీనివాస్, వెంకట్‌నర్సయ్య పాల్గొన్నారు.

**కర్నే మహేందర్‌కు పరామర్శ..**

బీఆర్‌ఎస్ కార్యకర్త కర్నే మహేందర్‌ను ఎమ్మెల్యే వేముల పరామర్శించారు. ఇటీవల బెజ్జోరాలో అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న మహేందర్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. మంగళవారం మహేందర్ ఇంటికి వెళ్లిన వేముల.. ఆరోగ్య వివరాలను తెలుసుకొని, అండగా ఉంటామని భరోసానిచ్చారు.




ఇసుక మాఫియా దాడిలో గాయపడిన బీఆర్‌ఎస్ కార్యకర్త మహేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల

**బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం..**

భీమ్‌గల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.





నిజామాబాద్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నాయకులు, నందిపేటలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, నాయకులు

# సార్ యాదిలో..

**ఉమ్మడి జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

**తెలంగాణ సిద్ధాంతకర్త** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు



సిరికొండ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

## పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల ధర్నా

ఇందల్వాయి/ సిరికొండ, ఆగస్టు 6: ఇందల్వాయి, సిరికొండ, నందిపేట తదితర మండలాల్లో బీడీ కార్మికులు కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ హామీ ప్రకారం పింఛన్లను రూ.4 వేలకు పెంచాలని, 18 ఏండ్లు పైబడిన మహిళలందరికీ రూ.2,500 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మాక్లూర్‌లో కేసీఆర్ మనవడు హిమాన్షు



మాక్లూర్ మండల కేంద్రంలో కొలువైన శ్రీరాముడ్ని మాజీ సీఎం కేసీఆర్ మనవడు కల్వకుంట్ల హిమాన్షు మంగళవారం దర్శించుకున్నారు. స్థానికంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. బీఆర్‌ఎస్ పార్టీ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల కుమారుడు అద్వైత్, హిమాన్షు క్లాస్‌మేట్స్. ఈ నేపథ్యంలో నిజామాబాద్‌కు వచ్చిన వారు మాక్లూర్‌లోని పాండురంగ విఠలేశ్వర ఆలయం, ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్టను సందర్శించారు.

-మాక్లూర్, ఆగస్టు 6





స్లాబ్ లీకేజీతో తరగతి గదిలోకి వచ్చిన వర్షపు నీరు



బెంచీలు లేక కింద కూర్చున్న విద్యార్థులు.. పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

## చినుకుల మధ్యే పాఠాలు..

నిజామాబాద్ నగరంలోని శంకర్‌భవన్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదిలో స్లాబ్ నుంచి వర్షపు నీరు వస్తున్నది. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. బడిలో మొత్తం నాలుగు గదులుండగా రెండు గదుల స్లాబ్ నుంచి నీరు వస్తున్నది. అయినా కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఇదిలా ఉండగా అమ్మ అదర్శ పాఠశాల పనులు చేపట్టిన గదుల్లోనే నీటి లీకేజీలు బయట పడడం గమనార్హం.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రాస్తారోకో చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

## చదువు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

**బోధన్-హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో**

నాగిరెడ్డిపేట, ఆగస్టు 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఆరు రోజులుగా కళాశాలకు తాళం వేసి ఉండడంతో.. ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోధన్–హైదరాబాద్ రహదారిపై ఏబీవీపీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. అరగంటపాటు రాస్తారోకో చేయడంతో రహదారికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమించాలని సూచించారు. విద్యార్థులు అక్కడి నుంచి ర్యాలీ గా తహసీల్ కార్యాలయం చేరుకొని నిరసన తెలిపారు. తహసీల్దార్ లక్ష్మణ్ వెంటనే కలెక్టర్, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంతో ఫోన్‌లో మాట్లాడగా.. నాలుగు రోజుల్లో అధ్యాపకులను ఏర్పాటు చేసి పాఠాలు బోధిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పడంతో విద్యార్థులు శాంతించారు.

## మధ్యాహ్న భోజనంలో పురుగులు



భోజనంలో పురుగులు

మాచారెడ్డి, ఆగస్టు 6 : భావి భారత పౌరులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో నిర్లక్ష్య పూరిత ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల నిజామాబా ద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లిలో జరిగిన ఘటన మరువక ముందే కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో మరో నిర్లక్ష్యం బయటికి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొంత మంది విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి, ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.